క్లుప్తంగా

నేడు మండల సమావేశం

సీఎస్‌పురం(పామూరు): సీఎస్‌పురం మండల సర్వసభ్య సమావేశం సోమవారం జరగాల్సి ఉండగా నిర్దిష్ట సమయం లోగా సభ్యులు సమావేశానికి రాకపోవడంతో కోరంలేక మంగళవారం ఉదయం 11 గంటలకు సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య తెలిపారు. సభ్యులు హాజరు కావాలని కోరారు.

నారాయణస్వామి ఆదాయం రూ.2.22 లక్షలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.2,22,977 ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ ఎస్‌జీఆర్. నరసింహబాబు సోమవారం తెలిపారు.

అమ్మాయిల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే చర్యలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై మహేంద్ర

జరుగుమల్లి(సింగరాయకొండ): అమ్మాయిల పట్ల ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్సై బి.మహేంద్ర హెచ్చరించారు. జరుగుమల్లి మండలం కామేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం గుడ్ టచ్ – బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు.

పీర్ల పండుగ ప్రారంభం



పీర్ల పెట్టెలను ఊరేగింపుగా తీసుకుపోతున్న ముస్లింలు

పామూరు: పీర్ల పండుగ వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా స్థానిక ఆకుల వీధిలోని హజరత్ మహబూబ్ సుబాని దర్గా వద్ద నుంచి , స్థానిక పాతబస్టాండ్ వద్ద పీర్ల చావిడిలో ఉన్న పీర్ల పెట్టెలను దించి ఉత్సవంగా చావిళ్లకు తరలించారు. ఈసందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు అనంతరం ముజావర్లు ప్రసాదాలను భక్తులకు పంచిపెట్టారు. ముజావర్‌లు షేక్.ఖాజామొహిద్దీన్, షేక్.సత్తార్, షాహుల్, సందానిబాష పాల్గొన్నారు.

మీకోసంకు మూడు అర్జీలు

సింగరాయకొండ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కారంపై జరిగిన మీకోసం కార్యక్రమంలో మూడు అర్జీలు వచ్చినట్లు డిప్యూటీ తహశీల్దార్ తానికొండ ప్రసాద్ తెలిపారు. ఈ మూడు అర్జీలు పాసుపుస్తకాల మంజూరు చేయాలని వచ్చినట్లు పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం



కనిగిరిరూరల్: మండలంలోని తమటంవారిపల్లి సమీపంలో ప్రమాదవశాత్తు కారు దగ్ధమైంది. ఈ సంఘటన సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. పామూరు నుంచి మండలంలోని బల్లిపల్లికి వస్తున్న కారులో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. వెంటనే అందులో ఉన్నవారు అప్రమత్తమై కారు దిగారు. మంటలు వేగవంతమై కారు దగ్ధమైంది. దీనిపై ఎటువంటి సమాచారం లేదని ఎస్సై ట.శ్రీరాం తెలిపారు.

డ్రాపౌట్స్ విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలి

లింగసముద్రం: డ్రాపౌట్స్ విద్యార్థులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించే విధంగా కృషి చేయాలని ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు, ఎంఈఓ–2 శివకుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకటి నుండి ఐదో తరగతి వరకు డ్రాపౌట్స్ విద్యార్థులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించే విధంగా కృషి చేయాలన్నారు.

వేలాన్ని బహిష్కరించిన రైతులు



రైతులు, రైతు సంఘు నాయకులతో మాట్లాడుతున్న బోర్డు అధికారులు

కనిగిరిరూరల్: లోగ్రేడ్‌లోని అన్ని రకాల పొగాకు బేళ్ల కొనుగోలు చేయాలని, రైతుకు కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కూడా రైతులు వేలం కేంద్రాన్ని బహిష్కరించి, ధర్నా చేశారు. వివరాల్లోకి వెళితే. శనివారం వేలం కేంద్రాన్ని బహిష్కరించిన అలవలపాడు క్లస్టర్ రైతులు సోమవారం కూడా తమకు గిట్టుబాటు ధర కల్పించి, లోగ్రేడ్, అన్నిరకాల పొగాకు బేళ్ల కొనుగోలు చేసే విధంగా బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కనిగిరి, పొదిలి బోర్డు ఆక్షన్ అధికారులు రైతులతో జరిపిన చర్యలు విఫలం చెందాయి. అధికారులు సరైన హామీ ఇవ్వక పోవడంతో రైతులు, రైతు సంఘ నాయకులు ఆఫీసు గేటు వద్ద బైఠాయించిన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘ నాయకులు పిల్లి తిప్పారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వాలు రైతుల ఆదుకోవడంలో తీవ్రంగా విఫలం చెందాయన్నారు. అన్ని రకాల పొగాకు బేళ్ల కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు నాయకులు కాసు వెంకటేశ్వరరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాలూరి రమణారెడ్డి, బి. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములు ఆక్రమిస్తే చర్యలు



పామూరు విరువూరురోడ్డులోని భుజంగేశ్వర స్వామి భూములు

పామూరు: స్థానిక విరువూరురోడ్డులో సర్వేనంబర్ 256/2లో ఉన్న 29.33 ఎకరాల భూమిని కొంత మంది ఆక్రమించి కట్టడాలు నిర్మించారు. ఈ భూముల్లోని ఆక్రమణలు, కట్టిన నిర్మాణాలకు సంబంధించి దేవాదాయశాఖ త్వరలో చర్యలు తీసుకోనున్నట్లు ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. ఈప్రాంతంలో ఎవరైనా నూతనంగా కట్టడాలు, ఫెన్సింగ్ ఏర్పాటు చేయవద్దని ఎవరైనా దీనిని ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టినా, ఆక్రమణలుచేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సదరు భూములకు సంబంధించి రికార్డులను దేవస్థాన కార్యాలయానికి వచ్చి పరిశీలించుకోవచ్చని ఈఓ నరసింహబాబు తెలిపారు.

పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కేంద్ర బృందంతో అధికారులు

పీసీపల్లి: పాఠశాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్వచ్ఛ సర్వేక్షన్ కేంద్ర బృందం ప్రతినిధులు బి.సుధీర్, ఎం ప్రశాంత్ అన్నారు. మండల పరిధిలోని పెదఅలవపాడులో పరిసరాల పరిశుభ్రత, పాఠశాలల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల పరిశుభ్రత గురించి వివరించారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు, అంగన్‌వాడీ సెంటర్లలో, ప్రార్థన మందిరాల వద్ద పరిశుభ్రత పర్యటించి పరిశీలించారు. వీరి వెంట స్వచ్ఛభారత్ కో ఆర్డినేటర్ షేక్ ఖాజావలి, డీపీఆర్‌సీ సురేష్ బాబు, ఎంపీడీఓ హనుమంతరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్, డిప్యూటీ ఎంపీడీఓ ఎస్ రాంప్రసాద్, చెరుకూరి సతీష్, ఏపీఓ జహంగీర్, బాషా, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పాలవ్యాన్ ఢీకొని యువకుడు మృతి



మృతుడు జీవరాం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

కనిగిరిరూరల్: పాలవ్యాన్ ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగింది. వివరాల్లోకి వెళితే..రాజస్థాన్‌లోని జ్యోతిపూర్‌కు చెందిన జీవరాం(30) విగ్రహాలు తయారు చేస్తూ 15 ఏళ్లుగా కనిగిరి పట్టణ సమీపంలోని కొత్తూరు వద్ద నివసిస్తున్నాడు. ఈక్రమంలో పామూరు రోడ్డులోని భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో జీవరాం ఆదివారం రాత్రి రోడ్డు దాటుతుండగా.. కనిగిరి నుంచి పామూరు వైపు వేగంగా వెళ్తున్న పాలవ్యాన్ అతన్ని ఢీ కొట్టింది. ఈ దుర్ఘటనలో జీవరాం అక్కడిక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని ఎస్సై టి.శ్రీరాం సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపరాదు

పొన్నలూరు: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావద్దని ఎస్సై అనూక్ అన్నారు. పొన్నలూరులో సోమవారం బ్రీత్ ఎనలైజర్ ద్వారా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన పలువురిపై కేసులు నమోదు చేశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు సంభవించి విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటారన్నారు. రోడ్డు నిబంధనలు పాటించకపోతే కేసులు తప్పవన్నారు.



పొన్నలూరులో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తున్న పోలీసులు

248 బేళ్లు తిరస్కరణ

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో 248 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణ అధికారి జి. సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని కొండపి, పోలిరెడ్డిపాలెం, చౌటపాలెం, రామాయపాలెం, దాసిరెడ్డిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 941 బేళ్లను వేలానికి తీసుకురాగా 693 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.245.37గా నమోదైంది. వేలంలో 22 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

వలేటివారిపాలెం: మండలంలోని కాకుటూరులోని ఉపాధి హామీ పనులను ఏపీఓ దయసాగర్ సోమవారం తనిఖీ చేశారు. మస్టర్ రికార్డులు పరిశీలించారు. మస్టర్ల ప్రకారం ప్రతి ఒక్కరూ హాజరవుతున్నారా అడిగి తెలుసుకున్నారు. కూలీలకు తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు.

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మత్స్యకారులతో మాట్లాడుతున్న ఎస్సై మస్తాన్‌షరీఫ్

ఉలవపాడు: తీరప్రాంత ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ కొత్త వ్యక్తుల కదలికలు గమనిస్తూ ఉండాలని రామాయపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌స్టేషన్ ఎస్సై మస్తాన్‌షరీఫ్ అన్నారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని అలగాయపాలెంలో పల్లెనిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామప్రజలతో మాట్లాడారు. దేశ భద్రత దృష్ట్యా సముద్రమార్గం ద్వారా మన దేశంలోకి టెర్రరిస్టులు, ఉగ్రవాదులు ప్రవేశించకుండా ఉండడానికి తీరప్రాంత గ్రామ ప్రజలసహకారం అవసరం అన్నారు. మత్స్యకారులు సహకరించాలని కోరారు. అనుమానాస్పద సమాచారం తెలిస్తే వెంటనే 1093 కి గానీ, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌స్టేషన్‌కు గానీ తెలియపరచాలని తెలియచేశారు.

ఆర్టీసీ బస్సు బోల్తా



బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

టంగుటూరు: ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు కళ్లు తిరగడంతో బస్సు బోల్తా పడింది. ఈ సంఘటన మండలంలోని ఎం నిడమానూరు–పొందూరు గ్రామాల మధ్య సోమవారం జరిగింది. స్థానికులు, ప్రయాణికులు తెలిపిన వివరాల మేరకు.. ఒంగోలు నుంచి పొందూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఎం నిడమానూరు గ్రామం దాటిన తర్వాత బస్సు నడుపుతున్న డ్రైవర్‌కు కళ్లు తిరిగాయి. దీంతో పక్కనే ఉన్న కాలువలోకి బస్సు బోల్తా పడింది. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. అటుగా పోతున్న స్థానికులు స్పందించి బస్సులోఉన్న వారిని బయటకు తీశారు. ఆ సమయంలో 30 మంది ప్రయాణికులు ఉండగా 10 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదంలో బస్సు కరెంట్ స్తంభాన్ని ఢీకొంది అదృష్టవశాత్తు ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోవపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. సంఘటనా స్థలానికి ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ నాయక్, అసిస్టెంట్ ఇంజినీర్ విజయ చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి, ప్రయాణికులకు మరో బస్సు ఏర్పాటు చేసి ప్రయాణికులను తమ గమ్యాలకు చేర్చారు.

స్కందపురిలో మెరుగైన వైద్య సేవలు

కందుకూరు రూరల్:



కందుకూరు పట్టణవ్యూ

కందుకూరు ప్రాంత ప్రజలు ఒకప్పుడు మెరుగైన వైద్య సేవల కోసం పక్క జిల్లాలకు పరుగులు తీసేవారు. కానీ మారుతున్న కాలానికి అనుగుణంగా ఇప్పుడు కందుకూరులోనే అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. దూర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగా మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. స్థానిక ప్రణతి చిన్న పిల్లలు, కంటి హాస్పిటల్‌లో వైద్యులు కె.నవీన్‌కుమార్, ఎన్.ప్రశాంతిలు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. కంటికి సంబంధించిన అన్ని రకాల సర్జీలు చేస్తున్నారు. పామూరు రోడ్డులోని బాబు దంత వైద్యశాలలో వైద్యులు షేక్ జావిద్ దంతాలకు ఆధునాతన పరికరాలతో వైద్యం చేస్తున్నారు. హెల్త్‌కార్డులు జర్నలిస్ట్ హెల్త్ కార్డులపై వైద్యం అందిస్తున్నారు. సింగరాయకొండలోని శివరామిరెడ్డి హాస్పిటల్‌లో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. అలాగే శివరామిరెడ్డి నర్సింగ్ హోంలో సుగరు, బీపీ, గుండె వ్యాధులు, ఊపిరితిత్తలకు సంబంధించిన వ్యాధులకు ప్రత్యేక వైద్యం అందిస్తున్నామని వైద్యులు బి.అశోక్‌కుమార్ తెలిపారు.

ఆశా కార్యకర్తల నియామకానికి దరఖాస్తులు

పొన్నలూరు: పొన్నలూరు మండలంలోని నాగిరెడ్డిపాలెం, పొన్నలూరు గ్రామ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్తల పోస్టుల నియామకానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ కృష్ణచైతన్య సోమవారం ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఆపై తరగతులు ఉత్తీర్ణత పొంది 25 నుంచి 45 ఏళ్ల లోపు ఆసక్తి కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. జూలై 6వ తేదీ లోగా తమ అర్హత పత్రాలతో పీహెచ్‌సీలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వీహెచ్‌ఎస్‌ఎంసీ కమిటీ తీర్మానంతో జిల్లా వైద్యశాఖ అధికారులు అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు.

వేలం ప్రకటన

నెల్లూరు జిల్లా, కందుకూరు మండలము,మాచవరం మరియు కొండముదుసుపాలెం గ్రామలలో గల శ్రీ పుష్పగిరి మఠం యొక్క హక్కు భుక్తములు కలిగి ఈ దిగువ షెడ్యుల్ దాఖలా భూములను **తేది.11.07.2025 న ఉదయం 10.30 నుండి కడప నగరం శ్రీ పుష్పగిరి మఠం మేనేజరు వారి కార్యాలముులో** దేవాదాయ శాఖ అధికారుల వారి సమక్షములో కౌలుకు బహిరంగ వేలము వేయబడును.

వ. నెం	గ్రామము	సర్వే నెం.	విస్తీర్ణము	వేలంపాట తేది	వేలంపాట సమయం	వేలంవేయు స్థలం	ధరావత్తు
1	కొండముదుసు పాలెం	447	6.44	11.07.25	ఉ.10.30	శ్రీ పుష్పగిరిమఠం	5,000/-
2	మాచవరం	627	1.50	11.07.25	ఉ.11.30	మేనేజరు వారి	2,000/-
		707	1.42	11.07.25	ఉ.11.30	కార్యాలయం	2,000/-
		799	0.28	11.07.25	ఉ.11.30	42/372-5&6	
		816	8.16	11.07.25	ఉ11.30	జయనగర్ కాలని	5,000/-
		841	1.00	11.07.25	ఉ11.30	కడప	2.000/-

గమనిక : **పాట కాలపరిమితి సం.2025-26 నుండి స.2027-28 వరకు అనగా 3(మూడు) సంవత్సరములు మాత్రమే.** ఏ కారణము చేతనైనా పాట నిలుపుదల చేయుటకు గాని పాట వాయిదా వేయుటకు గాని పుష్పగిరి మఠం వారికి పూర్తి అధికారము గలదు. సంస్థకు బకాయి ఉన్నవారు, లావాదేవీలు ఉన్నవారు పాటలో పాల్గొనుటకు అనర్హులు, వేలం పాట షరతుల గురించి మఠం కార్యాలయము నందు తెలుసుకొనవచ్చును.

తేది : 30.06.2025
కడప

మేనేజర్
శ్రీ పుష్పగిరి మఠం

హైస్కూల్, పోలింగ్ బూత్‌ల పరిశీలన

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని పోలింగ్‌బూత్‌లను, హైస్కూల్‌ను తహసీల్దార్ షేక్.మహమ్మద్ హుస్సేన్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా మండలంలోని డీజీపేట జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను సందర్శించి పాఠశాలలోని సన్నబియ్యాన్ని పరిశీలించారు. అనంతరం సీఎస్‌పురం, డీజీపేటలోని పోలింగ్‌బూత్‌లను పరిశీలించారు. అదేవిధంగా జాతీయరహదారి 167బీలో భూముల కోల్పోతున్న రైతులకు చెందిన పలువురి భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన వెంట సీనియల్ అసిస్టెంట్ పద్మనాభం, వీఆర్‌ఓలు శ్రీనివాసులు, షరీఫ్, మన్సూర్‌బాషా పాల్గొన్నారు.